క్లుప్తంగా

విద్యార్థులపై సెల్‌ఫోన్ల ప్రభావం పడకుండా చూడాలి



మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : విద్యార్థులపై సెల్ ఫోన్ల ప్రభావం పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు అన్నారు. శనివారం మండలంలోని అనంతారం మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారితో చర్చించారు. విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత కలిగేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలీస్ మినిస్ట్రీస్ తెలంగాణ అధ్యక్షుడిగా ప్రభాకర్



సంస్థ చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రభాకర్

చివ్వెంల : అలీస్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖాసీంపేట గ్రామంలోని బెతస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ దుర్గం ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు సిస్టర్ అలీస్ మద్దినేని ప్రకటించారు. శుక్రవారం ఖాసీంపేట బెతస్థ మినిస్ట్రీస్ 17వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంస్థను ప్రారంభించే క్రమంలో అధ్యక్షులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. తనను ఎంపిక చేసినందుకు ఆమెకు దుర్గం ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. డేవిడ్, సీహెచ్. శ్యామ్ ప్రసాద్, ఇమ్మానియేల్, జాన్ కాంతారావు, గాబ్రియేల్, జలగం జేమ్స్, ఉట్కూరి రాజు, పరంజ్యోతి, మందుల బాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎలక్ట్రికల్ శానిటరీ పవర్ టూల్స్ హార్డ్‌వేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నోముల లవకుమార్, ఉపాధ్యక్షుడిగా బైరిక శ్రీనివాస్, కార్యదర్శిగా బైరబోయిన సంతు, సహాయ కార్యదర్శిగా పోలోజు మదనాచారి, కోశాధికారిగా కొప్పోజు సతీష్, సభ్యులుగా ఎంఏ. ఆరీఫ్, రాగి మహేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లవకుమార్ మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులను ప్రజలకు విక్రయించాలని కోరారు.

రైతులందరి రుణాలను మాఫీ చేయాలి



మాట్లాడుతున్న బొడ్డు శంకర్

అర్వపల్లి : పంట రుణాలు రూ.లక్షలోపు తీసుకున్న రైతులందరి రుణాలను వెంటనే మాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం తిమ్మాపురంలో జరిగిన ఏఐకేఎంఎస్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనేక మంది రైతులు రుణమాఫీ కాక అధికారుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. వ్యవసాయ అధికారులు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటుచేసి రైతుల నుంచి వచ్చే వినతులను స్వీకరించి వారికి తగు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, సంపెట కాశయ్య, కోట మధు పాల్గొన్నారు.

ప్రగతిశీల మహిళా సంఘం సభ్యత్వ నమోదు

అర్వపల్లి : మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు పోలెబోయిన అవిలమ్మ కోరారు. జాజిరెడ్డిగూడెంలో శనివారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పీఓడబ్ల్యూ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు మహిళా ఓట్లను రాబట్టుకోవడానికి ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆ తర్వాత మర్చిపోతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మంగమ్మ, సునీత, సంధ్య పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు

నాలుగేళ్లుగా అరకొర సేవలే!

- వెంపటి పశువైద్యశాలలో వైద్యుడి పోస్టు ఖాళీ
- డిప్యుటేషన్‌పై అప్పుడప్పుడు వచ్చి సేవలందిస్తున్న డాక్టర్లు
- పశువులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న రైతులు



వెంపటిలో తాళం వేసి ఉన్న పశు వైద్యశాల

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలో పశువులకు చికిత్స అందించడం కోసం తుంగతుర్తి, వెలుగుపల్లి, వెంపటి గ్రామాల్లో మొత్తం మూడు పశు వైద్యశాలలు ఉన్నాయి. అయితే వెంపటి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పశువైద్యశాలలో సమస్యలు వెంటాడుతున్నాయి. గత నాలుగు సంవత్సరాలుగా శాశ్వత వైద్యాధికారి లేక రైతులు, పశుపోషకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో మోతె నుంచి డాక్టర్ డిప్యుటేషన్‌పై వెంపటికి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలు పనిచేశారు. కానీ మళ్లీ తాను పనిచేస్తున్న మోతెకు వెళ్లారు. అప్పటినుంచి వెలుగుపల్లి గ్రామంలో పనిచేస్తున్న డాక్టర్ వారంలో 2రోజులు (మంగళవారం, శుక్రవారం) వెంపటి పశువైద్యశాలకు వస్తూ సేవలు అందిస్తున్నారు. వెంపటి పశువైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్ లేకపోవడంతో పశువైద్యశాల నుంచి రైతులకు సబ్సిడీపై అందవలసిన పశుగ్రాసం విత్తనాలు, మందులు అందడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యశాలలో డాక్టర్, అటెండర్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఆస్పత్రి తాళాలు తీసే నాథుడు లేక మూతపడడంతో సాయంత్రం సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా వెంపటి పశువైద్యశాలకు పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని రైతులు, పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

నూతన టెక్నాలజీతో ముందడుగు

సూర్యాపేటటౌన్ : ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు నూతన టెక్నాలజీలతో ముందడుగు వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ముత్యాల రాజు, డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి టీజీఎప్‌సెట్ మొదటి విడత కౌన్సిలింగ్‌లో జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు 300పైగా అడ్మిషన్లు వచ్చిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్లాస్ వర్క్‌తోపాటు నైపుణ్యత పెంపొందించుటకు ప్రతి సంవత్సరం 35 రకాల ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీతో వర్క్ షాప్స్ నిర్వహిస్తున్నామని, ఇండస్ట్రియల్ విజిట్స్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 200 మందికి పైగా



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ రాజు

విద్యార్థులకు ఉన్నత కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ ఇప్పించినట్లు తెలిపారు. అలాగే బ్లడ్ డొనేషన్ క్యాంపులు, యాంటీ డ్రగ్స్ సదస్సులు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి

చివ్వెంల : జైలులో ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును సందర్శించారు. జైలులో ఖైదీల వివరాలను జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. చిన్నచిన్న ఘర్షణలతో జైలు పాలు కాకూడదని, సమాజంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని సూచించారు. తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ పెద్ద జైలులో ఉండటం వల్ల కుటుంబ సభ్యులు అందరూ మనోవేదనకు



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

గురికావాల్సి వస్తుందని తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలకు అడ్వకేట్‌ను పెట్టుకునే స్థోమత లేకపోతే న్యాయ సేవాధికార సంస్థలో దరఖాస్తు చేసుకుంటే అడ్వకేట్‌ను నియమిస్తామని పేర్కొన్నారు. అనంతరం జైలులో భోజన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు వసంత సత్యనారాయణ పిల్లే యాదవ్, న్యాయవాదులు జే.శశిధర్, మారపాక వెంకన్న, రమేష్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని అల్లునూరు గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై నాలుగు గేదెలు మృతి చెందగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన దుండిగాల లింగరాజుకు చెందిన మూడు గేదెలు మృతి చెందగా రూ. 1.20వేల చెక్కును, మల్లెబోయిన కాటమయ్యకు చెందిన గేదె మృతి చెందగా రూ. 40వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల సహకారంతో నియోజకవర్గంలోని రహదారులను, చిన్న నీటి పారుదల వనరులను అభివృద్ధి పర్చనున్నట్లు తెలియజేశారు. అల్లునూరు రహదారి మంజూరైనప్పటికీ పనులు చేపట్టకపోవడంతో పంచాయతీ



అల్లునూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

రాజ్ ఈఈని అల్లునూరు గ్రామానికి పిలిపించి సంబంధిత కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కందాల దామోదర్‌రెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి, మెంచు చక్రయ్య, పసుల అశోక్ యాదవ్, వీరబోయిన లింగయ్య, గోరుగంటి రాంకిషన్‌రావు, బంటు బద్రి, కట్టా మల్లారెడ్డి, బంటు క్రాంతి, ఇరుగు కిరణ్, అనంతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల ధర్నా విరమణ

నూతనకల్ : పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ చేపట్టిన ధర్నాను ఉన్నతాధికారుల హామీతో శనివారం విరమించినట్లు భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మొగుళ్ల గోపాల్ తెలిపారు. పెండింగ్ వేతనాలతోపాటు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఈఈ అరుణాకర్‌రెడ్డి, డీఈ రాజేందర్ హామీ ఇచ్చారని అన్నారు. ఆయన వెంట భగీరథ కాంట్రాక్ట్ వర్కర్లు కూసు ఉప్పలయ్య, చంద్రయ్య, సైదులు, హరీష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి

మునగాల : ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య కోరారు. శనివారం మునగాల మండలంలోని గణపవరంలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పొందలేకపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ నాయకులు చందా వెంకటేశ్వర్లు, మాసిరెడ్డి వెంకటరెడ్డి, వేల్పుల అంజయ్య, గొల్లపూడి కనకయ్య, పగిళ్ల సైదులు, మాజీ సర్పంచ్ చందా నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ



హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి

చివ్వెంల : న్యాయవాదులు హెల్త్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. వివిధ రకాల చికిత్స కోసం ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, కోశాధికారి ధరావతు వీరేష్ నాయక్, జిలకర్ర చంద్రమౌళి, బాణాల విజయ్ కుమార్, రెగట్టె శంకరయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ.. సాహసోపేతం



తిరుమలగిరి : వెలిశాలలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



అర్వపల్లి : పర్సాయపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మద్దిరాల : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జ్ఞానసుందర్, తదితరులు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేపట్టడం సాహసోపేతం అని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని వెలిశాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంభం సతీష్ గౌడ్, చెరువు వేణురావు, మర్రి వీరారెడ్డి, బైరెడ్డి సోమిరెడ్డి, సంకెపల్లి దామోదర్‌రెడ్డి, బైరెడ్డి హరికృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లంల యాకన్న, ఏపూరి శ్రీరాములు, ఏపూరి జీవయ్య, కుంభం మహేష్, ప్రసాద్ గౌడ్, కదారి సాయి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

అర్వపల్లి : ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ పర్సాయపల్లిలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవిలయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మద్దిరాల : పంట రుణాలను మాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని రామచంద్రాపురంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, గ్రామశాఖ అధ్యక్షుడు అంగిరేకుల వెంకన్న, మాజీ సర్పంచ్ ప్రమీలా, ఉపసర్పంచ్ తిరుమలేష్, వెలుగు వీరన్న, డాక్టర్ వెంకటనారాయణ, చంద్రకళ, సునీత, అంజమ్మ, ఎల్లమ్మ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం పరిశీలన

నూతనకల్ : వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన విధంగా మెనూ పాటించి నాణ్యమైన ఆహారం అందించాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వసతి గృహంలో మొత్తం 85మంది విద్యార్థులకు గాను 45మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం వేడిగా ఉన్నప్పుడే అందజేయాలని అన్నారు. వసతి గృహంలోని భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలపై అవగాహన

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ కోరారు. శనివారం నడిగూడెంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, సైదమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దిరాల : మన చుట్టూ ఉన్న పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్ననెమిల, ముకుందాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. వర్షాల దృష్ట్యా వీధుల్లో మురుగు నీరు నిలిచి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. కావున వీధుల్లో మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరారపు గౌతమిరాజు, అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



అర్వపల్లి : తిమ్మాపురంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



పెన్‌పహాడ్ : బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వెంకన్న, అనంతుల శ్రీశైలం, కోటేశ్వరరావు, శోభనలను శనివారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యుగేందర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంధ్యాల వినోద్, నల్లా శ్రీనివాసు, అల్లాడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు జమాల్‌షరీఫ్, శివశంకర్, ఖాసీం, మంజూర్, సైదానాయక్, రవి, మాధురి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

అర్వపల్లి : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని తిమ్మాపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కుంభం ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చాంప్ల, స్నేహలత, ఎన్. వెంకన్న, పదోన్నతిపై వెళ్లిన పీడీ సైదులు, సునంద, పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ఉపేందర్, సబియాసుల్తానా, రవీందర్, శ్రీనివాస్, దాసయ్యలను శనివారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, వర్దెల్లి కృష్ణయ్య, కొండ వెంకన్న, మురళీకృష్ణ, సీహెచ్. రవీందర్, కాకి సీనయ్య, మాధవి, రెహనాబేగం, మహబూబ్‌అలీ, లలితకుమారి, సంపత్ పాల్గొన్నారు.

అర్వపల్లి కేజీబీవీని సందర్శించిన అధికారులు



కేజీబీవీ ఆవరణను పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : వర్షాలు పడిన ప్రతిసారి అర్వపల్లి శివారులోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం జలమయమై బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. 2రోజులుగా వర్షాలు పడుతుండటంతో ముందు జాగ్రత్తగా మండల అధికారులు శనివారం కేజీబీవీని పరిశీలించారు. వరద వస్తే కేజీబీవీలో నీళ్లు నిల్వకుండా తీసుకునే చర్యలపై చర్చించారు. వర్షంతో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, ఎస్ఐ ఎస్‌కె.యాకూబ్, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య, ఎస్ఓ నాగరాణి పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్‌కు సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల నాయబ్ తహసీల్దార్ దొంతిరెడ్డి ఝాన్సీ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆమెను శనివారం కార్యాలయంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగారం తహసీల్దార్ బ్రహ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలంధర్ రావు, గిర్దావర్లు వెంకట్‌రెడ్డి, కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్లు సరిత, మల్లేశ్వరి, అశోక్, రికార్డు అసిస్టెంట్లు రమేష్, ఆదేష్, శ్రీకాంత్, శివ, సీఓలు ఖమ్మంపాటి సైదులు, వినయ్, సిబ్బంది లాల్‌మహ్మద్, మీరాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నూతనకల్‌లో శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానితో మాట్లాడుతున్న అధికారులు


మద్దిరాల : వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మధునాయుడు అన్నారు. శనివారం మద్దిరాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగుల వద్ద చేపల వేటకు వెళ్లొద్దని, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోడ్డు దాటే సమయంలో వాగులు ఉప్పొంగే ప్రమాదం ఉన్నందున్న ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సెల్ఫీల కోసం వరద ప్రవాహాల వద్దకు వెళ్లి ప్రమాదాల బారినపడొద్దని తెలిపారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి సహాయం పొందాలని సూచించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

నూతనకల్ : వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి ఆయా గ్రామాల అధికారులను ఆదేశించారు. శనివా రం తాళ్లసింగారం గ్రామ శివారులోని రామసముద్రం చెరువు కట్టను ఐబీ అధికారులు పరిశీలించారు. మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వారిని సురక్షిత ప్రదేశానికి వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ

తుంగతుర్తి : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందంజలో ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. పాఠశాలల్లో కరెంట్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో స్కావెంజర్‌ను నియమించాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఐఆర్ 20శాతం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు చింత రెడ్డి రామలింగారెడ్డి, గుజ్జ భాస్కర్, రాజన్న, హరికిషన్, చంద్రశేఖర్, రమేష్, అబ్బయ్య, యాకయ్య, సహదేవ్, ఎలిజబెత్, రఘుపతి, శ్రీరాములు, కవిత పాల్గొన్నారు.



తుంగతుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత

మునగాల : మండల కేంద్రానికి చెందిన క్రైస్తవ సంస్థ పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు జె.జె.సామ్యూల్‌సన్ గరిడేపల్లి మండలం వెలిదెండ గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు శనివారం మునగాలలో ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు క్లెం ఏలియా, సుధాకర్, లూకా, రాజు, సుజాత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. పత్తి పంటలకు జీవం

- వ్యవసాయ పనుల్లో బిజీగా రైతులు

పెన్‌పహాడ్ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలకు జీవం పోసినట్లయింది. ఈ వానాకాలంలో ప్రారంభం నుంచే వర్షాలు కురవలేదు. అయితే అప్పుడప్పుడు కురిసిన చిరుజల్లులకు రైతులు కొన్నిచోట్ల విత్తనాలు వేసుకున్నారు. అనంతరం ఆ చిన్నపాటి చినుకులు కూడా ముఖం చాటేయడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు మొలకెత్తక రైతులు మరోసారి విత్తనాలను వేయాల్సి వచ్చింది. ఈ తరుణంలో కురుస్తున్న వర్షం రైతులకు కాస్త ఊరట కలి గించింది. మండలంలో కురుస్తున్నవి చిరుజల్లులే అయినా.. ఎడతెరపి లేకుండా పడుతుండడంతో వ్యవసాయ భూముల్లోకి నీరు చేరుతోంది. ముసురును సైతం లెక్క చేయకుండా కూలీలు, రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మండలంలో ఏటా వర్షాకాలంలో పత్తి అధికంగా సాగవుతుంది. ఆయకట్టు కింద ఉన్న రైతులు పంటలను సాగు చేసుకుంటూ బిజీగా ఉన్నారు.



మాచారంలో సాగవుతున్న పత్తి పంట

రైతులకు ప్రయోజనం



3 రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు మేలు జరుగుతుంది. ముసురు వల్ల పత్తి పంటలకు జీవం పోసినట్లు అయ్యింది. మండలంలో వరి సాగు పనులు కూడా వేగవంతమయ్యాయి. వర్షం ఇలాగే కురిస్తే చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

– బి.కృష్ణసందీప్, ఏఓ